సాక్షి నిజామాబాద్

గురువారం । 14 । డిసెంబర్ । 2023



పట్టు పడితే పతకమే..

ఆర్మూర్‌కు చెందిన భాను ప్రసాద్, మహేశ్ అంతర్జాతీయ రెజ్లింగ్ పోటీల్లో సత్తా చాటుతున్నారు.

- 8లో ▸



ముందుంది ముసళ్ల పండుగ

పథకాలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ముందుంది ముసళ్ల పండుగ అని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం అన్నారు.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం 30.5 /16.7

వాతావరణం

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి పొగమంచు కురుస్తుంది. చలితీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

ఎకో టూరిజానికి స్థల పరిశీలన



డొంకేశ్వర్(ఆర్మూర్) : గోదావరి నది ఒడ్డున ఎకో టూరిజం ఏర్పాటుకు సంబంధించిన స్థల పరిశీలన మరోసారి జరిగింది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డీఎఫ్‌వో రంజిత్ నాయక్ ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ప్రాంతాన్ని సందర్శించగా, తాజాగా బుధవారం ఇరిగేషన్, ఫారెస్టు, రెవెన్యూ శాఖ అధికారులు కలిసి సర్వే నిర్వహించారు. డొంకేశ్వర్ మండలం గాదేపల్లి వద్ద గోదావరి బ్యాక్ వాటర్ స్థలాన్ని పరిశీలించారు. ఇక్కడ మొత్తం 18 ఎకరాల్లో ఎకో టూరిజం ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ఎంత వరకు వస్తుందనే దానిపై ఇరిగేషన్ అధికారి ఏఈ రవి సర్వే చేశారు. ఏ ప్రాంతం నుంచి టూరిజం స్పాట్ ఏర్పాటు చేయాలనే దానిపై నివేదించనున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం గాదేపల్లి బ్యాక్ వాటర్ వద్ద స్థలం అందుబాటులో లేనట్లుగా తెలుస్తోంది. సర్వే చేసిన వారిలో డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సుధాకర్, రెవెన్యూ జూనియర్ అసిస్టెంట్ రాజు ఉన్నారు.

ఆర్టీసీలో డీజిల్ మెకానిక్ అప్రెంటిస్‌షిప్

ఖలీల్‌వాడి: ఆర్టీసీలో డీజిల్ మెకానిక్ అప్రెంటిస్‌షిప్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్‌ఎం జానీరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఐటీఐలో డీజిల్ మెకానిక్ కోర్సు పూర్తిచేసిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 22లోపు www. apprenticeship india.org వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులను మెరిట్ ప్రాతిపదికన సెలెక్ట్ చేసి నిజామాబాద్ రీజియన్ పరిధిలోని ఆరు డిపోల్లో అవసరం మేరకు అప్రెంటిస్‌షిప్ కోసం కేటాయిస్తామని పేర్కొన్నారు.

నిజాంసాగర్ నీటి విడుదలకు ఆమోదం



నిజాంసాగర్: యాసంగి సీజన్‌లో నిజాంసాగర్ ప్రాజెక్టునుంచి ఆయకట్టుకు 11 టీఎంసీల నీటిని విడుదల చేయనున్నారు. బుధవారం హైదరాబాద్‌లో ఈఎన్‌సీ మురళీధర్ రావు నేతృత్వంలో జరిగిన శివం కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రాజెక్టు కింద మొదటి ఆయకట్టుతో పాటు అలీసాగర్ రిజర్వాయర్ వరకు యాసంగి సీజన్‌లో 1.25 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతాయని అంచనా వేశారు. ప్రస్తుతం నిజాంసాగర్ ప్రాజెక్టులో 1403.86 అడుగుల(16.164 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది. ఆయకట్టుకు ఆరు విడతల్లో 11 టీఎంసీల నీటిని విడుదల చేయనున్నారు. కాగా ఇప్పటికే నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు ఒక విడత నీటిని విడుదల చేశారు. పంటలు గట్టెక్కేందుకు మిగతా ఐదు విడతలలో నీటిని విడుదల చేయనున్నారు.

బోధన్ ఎంఎల్‌ఎస్ పాయింట్ ఇన్‌చార్జిపై వేటు

బోధన్ : సివిల్ సప్లయ్ కార్పొరేషన్‌కు సంబంధించిన బోధన్ ఎంఎల్‌ఎస్ పాయింట్ నుంచి అక్రమంగా బియ్యం తరలింపు ఘటనపై ఎంఎల్‌ఎస్ పాయింట్ ఇన్‌చార్జి అజయ్ కుమార్‌ను సస్పెండ్ చేస్తూ బుధవారం కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఉత్తర్వులు జారీ చేశారు. అక్టోబర్ రెండో వారంలో ఎంఎల్‌ఎస్ పాయింట్ నుంచి ఆటోలో 16 క్వింటాళ్ల బియ్యం తరలిస్తుండగా పోలీసులు పట్టుకుని విచారించారు. అవీ ప్రభుత్వ బియ్యమని గుర్తించి సంబంధిత శాఖ జిల్లా అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై కలెక్టర్ అధికారులతో విచారణ జరిపించారు. ఇన్‌చార్జి అజయ్‌కుమార్ ఆదేశాల మేరకే బియ్యం తరలించినట్లు విచారణలో తేలిందని సమాచారం. దీంతో ఆయనను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయమై సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ జగదీశ్‌ను సాక్షి వివరణ కోరగా ఇన్‌చార్జిని సస్పెండ్ చేస్తు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసి విషయం వాస్తవమేనని తెలిపారు. ఆయన స్థానంలో నవీపేట ఎంఎల్‌ఎస్ పాయింట్ ఇన్‌చార్జి గంగాధర్‌కు బాధ్యతలు అప్పగించినట్లు వివరించారు.

వదలరు.. కదలరు!


- ఏళ్లుగా తిష్ట వేసిన జిల్లా, మండల స్థాయి కీలక అధికారులు
- కొందరు గత ప్రభుత్వానికి తొత్తులుగా పనిచేశారనే విమర్శ
- సమాచార హక్కు చట్టానికీ తూట్లు
- కొత్త ప్రభుత్వం దృష్టి సారించాలంటున్న ప్రజలు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : ప్రభుత్వ అధికారులు రెండు మూడు ఏళ్లకు ఒకసారి బదిలీ కావడం సర్వసాధారణం. అడ్మినిస్ట్రేషన్‌తో పాటు ప్రభుత్వ పథకాలను అమలు చేసే విషయంలో ఎలాంటి పక్షపాత ధోరణి ప్రదర్శించకుండా ఉండేందుకు గాను బదిలీలు చేయడం అనేది తప్పనిసరి, ఆనవాయితీ కూడా. అయితే జిల్లాలో కొందరు జిల్లా, మండల స్థాయి అధికారులు తాము ఉన్న సీట్లను వదిలేది లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. కొందరు కీలక అధికారులు పదేళ్లకు పైగా ఒకేచోట పని చేస్తుండడం గమనార్హం. కొత్త ప్రభుత్వం కొలువుదీరిన నేపథ్యంలో సుదీర్ఘకాలంగా ఒకే చోట పనిచేస్తున్న అధికారులను బదిలీ చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఇటీవల జిల్లాలోని నందిపేట, డొంకేశ్వర్ మండలాల ఎంపీడీవో నాగవర్ధన్ 12 ఏళ్లుగా అక్కడ నుంచి కదలకుండా ఉంటూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరించాడంటూ కలెక్టర్‌కు పలువురు ఫిర్యాదు చేయడం గమనార్హం. నాగవర్ధన్ అక్రమాలపై విచారణ చేపట్టాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా కొందరు జిల్లా అధికారులు స్థాయి లేకున్నప్పటికీ ఇన్‌చార్జి హోదాలో (ఎఫ్‌ఏసీ) ఏళ్లతరబడి కొనసాగుతుండడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. దీంతో కిందిస్థాయి సిబ్బంది సైతం అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో సమాచారహక్కు చట్టానికి సైతం కొందరు అధికారులు తూట్లు పొడవడం గమనార్హం.

మండలాల్లో..

నందిపేట, డొంకేశ్వర్ మండలాల ఎంపీడీవో నాగవర్ధన్ 12 సంవత్సరాలుగా అక్కడే తిష్ట వేశారు. బోధన్ మున్సిపల్ డీఈ శివానందం తొమ్మిదిన్నర ఏళ్లుగా, మేనేజర్ నరేందర్ ఐదేళ్లుగా కొనసాగుతున్నారు. రుద్రూర్ ఎంపీడీవో బాలగంగాధర్, కోటగిరి, రుద్రూర్ ఎంఈవో శాంతికుమారి ఐదేళ్లుగా అక్కడే పని చేస్తున్నారు. కమ్మర్‌పల్లి, మోర్తాడ్, ఏర్గట్ల ఎంఈవో ఆంధ్రయ్య తొమ్మిదేళ్లుగా, బాల్కొండ వ్యవసాయ అధికారి మహేందర్‌రెడ్డి తొమ్మిదేళ్లుగా అక్కడే పనిచేస్తున్నారు. మోర్తాడ్ వ్యవసాయ అధికారి లావణ్య ఎనిమిది ఏళ్లుగా, కమ్మర్‌పల్లి ఐకేపీ ఏపీఎం గంగారెడ్డి ఎనిమిదేళ్లుగా కొనసాగుతున్నారు. మోర్తాడ్ ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, ముప్కాల్ ఎంపీడీవో దామోదర్ ఐదేళ్లుగా అదే పోస్టులో ఉన్నారు. ఇదిలా ఉండగా నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో కొందరు అధికారులకు ప్రమోషన్లు వచ్చినప్పటికీ అక్కడే కొనసాగుతుండడం విశేషం.



ఎంపీడీవో నాగవర్ధన్‌పై ప్రజలు కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదు

ఎనిమిదేళ్లుగా..

జిల్లా సహకార అధికారి సింహాచలం ఎనిమిది సంవత్సరాలుగా ఆ పోస్టు నుంచి కదలడం లేదు. సింహాచలం ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా నుంచి రావడం గమనార్హం. ఇక జెడ్పీ సీఈవో గోవింద్‌నాయక్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఇందిర సైతం ఆరేళ్లుగా కొనసాగుతున్నారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ మాజీ మంత్రి అండతో ఇన్‌చార్జి హోదాలో గత ఐదేళ్లుగా కదలకుండా తిష్ట వేశారు. రెగ్యులర్ సూపరింటెండెంట్ వచ్చినప్పటికీ ఛార్జి తీసుకోకుండానే వెళ్లేలా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అలాగే డీఎంహెచ్‌వో సుదర్శన్ సైతం ఆరేళ్లుగా ఇన్‌చార్జి హోదాలో కొనసాగుతున్నారు. సుదర్శన్ సైతం పలువురు కిందిస్థాయి సిబ్బందిని, కార్లు అద్దెకు పెట్టిన వ్యక్తులను వేధించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇక జిల్లా ఉద్యాన అధికారి నర్సింగ్‌దాస్, జిల్లా భూగర్భ జలవనరుల శాఖ అధికారి దేవేంద్రప్రసాద్ ఐదేళ్లుగా ఇక్కడే ఉన్నారు.

‘అర్జున’ రేసులో హుస్సాముద్దీన్

- అవార్డుకు నామినేట్ చేసిన బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా



నిజామాబాద్ నాగారం : జిల్లాకు చెందిన బాక్సింగ్ క్రీడాకారుడు హుస్సాముద్దీన్ అర్జున అవార్డు రేసులో నిలిచారు. ఆయన పేరును బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అవార్డు కోసం నామినేట్ చేసింది. నిజామాబాద్ నగరంలోని పూలాంగ్ ప్రాంతం పాటిగల్లీకి చెందిన ఎండీ శంషొద్దీన్, శాహనబేగం ఐదో సంతానం హుస్సాముద్దీన్. తండ్రి బాక్సింగ్ కోచ్ కావడంతో ఆయన దగ్గరే శిక్షణ తీసుకుంటూ ఓనమాలు నేర్చుకున్నాడు. నిరంతరం కష్టపడుతూ బాక్సింగ్‌లో అంతర్జాతీయ స్థాయికి ఎదిగాడు. డిగ్రీ పూర్తి చేసి ఆర్మీకి ఎంపికయ్యాడు. అయినా క్రీడల్లో పతకాలు సాధిస్తునే ఉన్నారు. ఒలింపిక్స్‌లో పతకం సాధించాలనే పట్టుదలతో ప్రత్యేకంగా శిక్షణ తీసుకుంటున్నాడు.

గతంలో నిఖత్‌కు అర్జున అవార్డు

జిల్లా నుంచి ఇప్పటి వరకు బాక్సింగ్ క్రీడలో గత ఏడాది నిఖత్ జరీన్‌కు అర్జున అవార్డు వచ్చింది. ఈ ఏడాది సైతం జిల్లాకు చెందిన హుస్సాముద్దీన్ నామినేట్ అయ్యారు. కేంద్ర ప్రభుత్వం పరిశీలన అనంతరం వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జాబితాను అధికారికంగా ప్రకటిస్తుంది. ప్రస్తుతం ఐదేళ్ల ప్రతిభ ఆధారంగా హుస్సాముద్దీన్ అర్జున అవార్డుకు నామినేట్ అయ్యారు. ఆయన నామినేట్ కావడంతో జిల్లాలోని క్రీడాకారులు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సాధించిన పతకాలు..

- జాతీయ స్థాయిలో 2009లో కాంస్యపతకం సాధించారు. 2010 నుంచి 2012 వరకు రజత పతకాలు, 2016, 2019లో బంగారు పతకాలు, 2021లో రజతం, 2022లో బంగారు పతకం గెలుపొందాడు.
- 2015లో కొరియాలో జరిగిన వరల్డ్ బాక్సింగ్‌లో కాంస్య పతకం, 2017లో బల్గేరియా దేశంలో జరిగిన బాక్సింగ్ పోటీల్లో రజతం సాధించాడు. మంగోలియాలో జరిగిన పోటీల్లో కాంస్యంతో సత్తా చాటాడు.
- 2018లో ఢిల్లీలో జరిగిన ఓపెన్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో, బల్గేరియా, ఆస్ట్రేలియాల్లో జరిగిన పోటీల్లో కాంస్య పతకాలు, జర్మనీలో జరిగిన పోటీలో పసిడి పతకం సాధించాడు.
- 2019లో ఫిన్‌లాండ్, పోలాండ్, థైలాండ్ దేశాల్లో జరిగిన పోటీల్లో రజత పతకాలు సాధించాడు.
- 2020లో బల్గేరియాలో జరిగిన పోటీలో కాంస్యం, చైనాలో జరిగిన పోటీలో పసిడి, జర్మనీలో జరిగిన పోటీల్లో కాంస్యం గెలుచుకున్నాడు.
- 2021లో స్పెయిన్‌లో జరిగిన బాక్సింగ్ పోటీలో రజతం సాధించాడు.
- 2022లో బర్మింగ్‌హామ్‌లో జరిగిన కామన్ వెల్త్ క్రీడల్లో కాంస్య పతకం, జోర్డాన్‌లో జరిగిన ఏషియన్ ఎలైట్ చాంపియన్‌షిప్‌లో బ్రాంజ్ మెడల్ సాధించాడు.
- 2023లో తాష్కెంట్‌లో జరిగిన వరల్డ్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో కాంస్యం సాధించాడు.

ఎరువులను అందుబాటులో ఉంచాలి



వ్యవసాయ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్ : జిల్లాలో రైతులకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కలెక్టర్ వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో ఎరువుల సమీకరణ, వాటి పంపిణీ తీరు తెన్నులపై సమీక్షించారు. జిల్లాలో ఎక్కడ కూడా యూరియా కొరత ఏర్పడకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. సహకార సంఘాల ద్వారా రైతులకు వారు సాగు చేస్తున్న పంట విస్తీర్ణాన్ని అనుసరిస్తూ సరిపడా మోతాదులో ఎరువులు అందించాలన్నారు. ఎరువుల కృత్రిమ కొరతను సృష్టించే డీలర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఎరువుల క్రయ విక్రయాల వివరాలను ఈ-పాస్ మెషిన్ ద్వారా వెంటనే నమోదు చేసేలా చూడాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఎక్కడైనా సమస్య తలెత్తితే తన దృష్టికి తేవాలన్నారు.

నకిలీ, నాసిరకం విత్తనాలు, క్రిమిసంహారక మందులు, ఎరువులతో రైతులు మోసపోకుండా పకడ్బందీగా పర్యవేక్షించాలన్నారు. అదనపు కలెక్టర్ పి యాదిరెడ్డి, వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్, జిల్లా సహకార అధికారి సింహాచలం, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ రంజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల రక్షణకు చర్యలు

- క్యాచ్ ద ట్రాప్ పేరిట అటవీ శాఖ స్పెషల్ డ్రైవ్
- అడవుల్లో వలలు, ఉచ్చులను గుర్తిస్తున్న సిబ్బంది
- అనుమానిత వేటగాళ్ల ఇళ్లలోనూ సోదాలు



వర్ని అటవీ ప్రాంతంలో వలను గుర్తించిన ఫారెస్టు సిబ్బంది

డొంకేశ్వర్(ఆర్మూర్) : వన్యప్రాణుల వేటకు అడ్డుకట్ట వేసేందుకు అటవీ శాఖ చర్యలు చేపట్టింది. రాష్ట్ర శాఖ ఆదేశాలతో జిల్లాలో ‘క్యాచ్ ద ట్రాప్’ అనే స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా పది రోజులుగా అటవీ శాఖ సిబ్బంది అడవులను జల్లెడ పడుతున్నారు. అడవుల్లో జంతువుల వేట కోసం ఏర్పాటు చేసిన వలలు, ఉచ్చులు, లైవ్ వైర్లు, విష పదార్థాలు, పేలుడు పదార్థాలను గుర్తించి తొలగిస్తున్నారు. దీంతో వన్యప్రాణులకు ప్రాణాపాయం తప్పుతోంది. అలాగే ఉచ్చులు ఏర్పాటు చేస్తున్న వేటగాళ్లు కూడా ఎవరో తెలుసుకునేందుకు అవకాశం ఏర్పడుతోంది. మరో పక్క పాత నేరస్తులు, అనుమానిత వేటగాళ్ల ఇళ్లలో కూడా అటవీ అధికారులు తనిఖీలు చేపడుతున్నారు. వలలు, ఉచ్చులను స్వాధీనం చేసుకుని హెచ్చరిస్తున్నారు. జిల్లాలో ఇప్పటికే సిరికొండ, వర్ని రేంజ్‌లలో వలలు, ఉచ్చులను గుర్తించారు. ప్రధానంగా అడవులు ఎక్కువగా ఉన్న ప్రాంతాలపై నిఘా పెట్టారు. జిల్లాలో మొత్తం ఏడు రేంజ్‌ల పరిధిలో 2,14,659 ఎకరాల్లో అటవీ విస్తీర్ణం ఉంది. జంతువుల దాహార్తిని తీర్చేందుకు అడవుల్లో 183 సాసర్ పిట్లను నిర్మించి అందులో నీళ్లు పోస్తున్నారు. సాసర్ పిట్లే కాకుండా నీటి గుంతలు, కాలువల వద్దకు కూడా వన్యప్రాణులు వస్తుంటాయి. వేటగాళ్లు ఈ ప్రాంతాలనే లక్ష్యంగా చేసుకుని ఉచ్చులు, వలలు, మత్తు పదార్థాలు ఏర్పాటు చేస్తుంటారు. అటవీ సిబ్బంది వీటిని గుర్తించి నిర్వీర్యం చేయడమే ‘ట్రాప్ ద క్యాచ్’ ప్రధాన లక్ష్యం.

సమాచారం ఇస్తే రివార్డులు

వన్యప్రాణులను వేటాడటం ఎప్పటి నుంచో నిషేధంలో ఉంది. కానీ కొందరు వేటగాళ్లు జంతు మాంసం కోసం, మరి కొందరు వాటి కొమ్ములు, చర్మంతో గుట్టుగా వ్యాపారమే చేస్తున్నారు. ముఖ్యంగా జింకలు, దుప్పిలు, ఉడుములు, కుందేళ్లు, నెమళ్లు, ఏదు, ముళ్ల పందులు, తదితర వాటిని ఎక్కువగా వేటాడుతున్నారు.అలాగే రైతులు కూడా అడవి జంతువుల నుంచి పంట పొలాలను కాపాడుకునేందుకు వలలు ఏర్పాటు చేస్తుంటారు. ఇలా ఎక్కువగా అడవులకు ఆనుకుని ఉన్న వ్యవసాయ క్షేత్రాల్లో జరుగుతూ ఉంటుంది. వలలో చిక్కుకున్న వన్యప్రాణులు వేటగాళ్ల చేతిలోకి వెళ్తున్నాయి. పొలాల వద్ద వలలు ఏర్పాటు చేయకూడదని అటవీ సిబ్బంది రైతులకు సూచిస్తున్నారు. చెప్పినప్పటికీ అలాగే చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. అలాగే వేట ఉచ్చులను గుర్తించి అత్యుత్తమ పనితీరు కనబర్చిన సిబ్బందికి ప్రోత్సాహం కూడా ఇవ్వనున్నారు. అదే విధంగా వేటకు సంబంధించిన సమాచారం ఇచ్చిన వ్యక్తులకు కూడా తగిన రివార్డులు ఇవ్వనున్నట్లు అటవీ అధికారులు పేర్కొంటున్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు రహస్యంగా ఉంచుతామని చెప్తున్నారు.

అడవులపై నిరంతర నిఘా..

ఉన్నతాధికారులకు ఆదేశాల మేరకు అడవుల్లో జంతువుల కోసం ఏర్పాటు చేసిన వలలు, ఉచ్చులను గుర్తించి తొలగిస్తున్నాం. క్షేత్రస్థాయిలో ఫారెస్టు బీట్ ఆఫీసర్లు నిరంతరంగా పర్యవేక్షణ చేసి నిఘా పెడుతున్నారు. వన్యప్రాణులను వేటాడిన వారెవరైనా సరే కఠిన చర్యలు తప్పవు. – పి పద్మారావు, ఎఫ్‌ఆర్వో, నిజామాబాద్ నార్త్ రేంజ్

బెల్ట్ షాపులు బంద్!

- ఉన్నతాధికారుల మౌఖిక ఆదేశాలతో..
- గ్రామాల్లోని బెల్టుషాపులను మూసి ఉంచాలని ఆదేశించిన ఎక్సైజ్ సిబ్బంది



మోర్తాడ్/ఖలీల్‌వాడి : పల్లెల్లో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలకు తెరతీసిన బెల్టుషాపులను ఇక నుంచి మూసి ఉంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో చట్ట విరుద్ధంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం బెల్ట్‌షాపులను తెరవొద్దని ఆదేశించినట్లు తెలిసింది. జిల్లాలో 102 లైసెన్స్ పొందిన మద్యం దుకాణాలు ఉండగా దాదాపును 500 బెల్టుషాపులు అక్రమంగా కొనసాగుతున్నాయి. ప్రభుత్వానికి మద్యం అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయం ప్రధానం కావడంతో బెల్టుషాపుల నిర్వహణపై ఎక్సైజ్ శాఖ చూసి చూడనట్లు వ్యవహరించింది. మద్యం దుకాణాల యజమానులు లక్ష్యానికి అనుగుణంగా మద్యం కొనుగోలు చేయడానికి నిర్దేశించిన ఆప్‌టెక్ పూర్తి కావాలంటే బెల్టుషాపుల నిర్వహణ కీలకం అనే భావన అందరిలో ఉంది. బెల్టుషాపులతో అన్ని చోట్ల మద్యం అమ్మకాలు జోరుగా సాగుతుండటం, శాంతియుత వాతావరణం దెబ్బతీసే అవకాశం ఉండటంతో దీనిని నియంత్రించడానికి ప్రభుత్వం సిద్ధమైంది. ఇందులో భాగంగానే బెల్టుషాపులను మూసి ఉంచాలని ఆదేశించినట్లు సమాచారం.

వీడీసీల ఆధ్వర్యంలో..

రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్లకోసారి మద్యం పాలసీని అమలు చేస్తోంది. ఇందులో భాగంగా ఈ ఏడాది డిసెంబర్ 1న కొత్త మద్యం పాలసీ అమలులోకి వచ్చింది. జిల్లాలో 102 వైన్‌షాపులను ఏర్పాటు చేశారు. అయితే ప్రతి యేటా మద్యం పాలసీ ప్రారంభం కాగానే గ్రామాల్లో వీడీసీలు వేలం పాటలు నిర్వహించి బెల్టుషాపుల నిర్వహణకు అనుమతి ఇచ్చేవి. వీడీసీలకు ఎలాంటి అధికారం లేకపోయినా ఆదాయం కోసం బెల్టుషాపుల నిర్వహణకు వేలంపాటలను నిర్వహించేవి. వేలంలో దుకాణాలను దక్కించుకున్న వారు ఎమ్మార్పీ కంటే అధికంగా విక్రయించేవారు. ఒక్కో బాటిల్‌పై రూ.10 నుంచి రూ.50 వరకు అధికంగా వసూలు చేసేవారు. కాగా ఈ బెల్ట్ దుకాణాల వారు సంబంధిత వైన్ షాపు నుంచే మద్యం కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఇప్పుడు బెల్టుషాపులను మూసి వేయాలని ఎక్సైజ్ శాఖ ఆదేశించడంతో వీడీసీల ఆదాయానికి కూడా గండిపడినట్లే అనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది.

ఎన్నికల కోడ్ నుంచి..

ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత ఎక్సైజ్ అధికారులు గ్రామాల్లో బెల్ట్‌షాపులను మూసి వేయించారు. అక్రమంగా మద్యం అమ్మినా, తరలించినా కేసులు నమోదు చేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు షాపులను మూసి వేశారు.

ఉత్తర్వులు అందలేవు

బెల్ట్‌షాపులను ఎన్నికల కోడ్ నుంచే మూసివేశాం. ప్రస్తుతం కొత్త ఎక్సైజ్ పాలసీ ద్వారా మద్యం అమ్మకాలు కొనసాగుతున్నాయి. బెల్ట్‌షాపులు మూసివేతపై ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. – మల్లారెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్, నిజామాబాద్ జిల్లా

బడా రాంమందిర్ భూములను కాపాడుతాం

- దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ సుప్రియ



మాట్లాడుతున్న దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ సుప్రియ

నిజామాబాద్ సిటీ : నగరంలోని గాజుల్‌పేట్ బడా రాంమందిర్(రాం మఠం)కు చెందిన భూములను కాపాడేందుకు మఠాన్ని దేవాదాయ ధర్మాదాయ శాఖ స్వాధీనం చేసుకున్నట్లు ఆ శాఖ ఉమ్మడి జిల్లాల సహాయ కమిషనర్ ఎస్ సుప్రియ తెలిపారు. బుధవారం రాంమందిర్ ఫిట్ పర్సన్, ఈవో జి వేణుతో కలిసి ఆలయంలో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలను తెలుసుకున్నారు. రికార్డులను తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ.. బడా రాంమందిర్‌కు చెందిన భూములు నిజామాబాద్‌లో 213 ఎకరాలు, ఆదిలాబాద్‌లో 149 ఎకరాలు, నాందేడ్(మహారాష్ట్ర)లో 117 ఎకరాలు ఉన్నాయని తెలిపారు. ఇందులో భూములను విక్రయించుకున్న వారిపై కోర్టులో కేసు వేశామని చెప్పారు. బడా రాం మందిరం, సారంగపూర్ ఆలయాలకు వచ్చిన హుండీ ఆదాయం, భూములను కౌలుకు ఇవ్వటం ద్వారా వచ్చిన ఆదాయాన్ని మఠంలోని మేనేజర్, సహాయ మేనేజర్లు బ్యాంక్ ఖాతాలో వేయకుండా, ఎటువంటి లెక్కలు చూపటంలేదని వారిపై కూడా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. బడా రాంమందిర్ ఉత్తరాధికారి దినాకర్ స్వామి నెలరోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందగా, ఆయన స్థానంలో మరొకరు వచ్చారని, కానీ ఆయనకు రాం మందిర్ ఉత్తరాధికారిగా నియమిస్తున్నట్లు అధికారికంగా తమకు ఎటువంటి ఉత్తర్వులు రాలేదన్నారు. ఆలయానికి చెందిన భూములను స్థానికంగా కొంతమంది విక్రయించి వాటికి సంబంధించిన రికార్డులను మాయం చేశారని తెలిపారు. అటువంటి భూములకు సంబంధించి ఏదైనా రుజువు పత్రాలు లభ్యం అయితే వాటి ఆధారంగా స్వాధీనం చేసుకుంటామన్నారు. అనంతరం ఆమె సారంగపూర్ హనుమాన్ ఆలయాన్ని పరిశీలించారు. ఆలయం ముందు గల మడిగెల ద్వారా వస్తున్న ఆదాయంపై ఆరా తీశారు. ఇక నుంచి అద్దెను దేవాదాయ శాఖకే చెల్లించాలని, రాం మందిర్ మేనేజర్‌కు చెల్లించవద్దన్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్‌ పట్టణంలోని మినీస్టేడియంలో 67వ ఎస్‌జీఎఫ్‌ ఉమ్మడి జిల్లాల అండర్‌–17 బాలబాలికల క్రీడాకారులను ఎంపిక చేసినట్లు జిల్లా ఎస్‌జీఎఫ్‌ కార్యదర్శి సంగీత రావు బుధవారం తెలిపారు. ఎంపికైన క్రీడకారులు వనపర్తి జిల్లాలో ఈ నెల 17, 18, 19వ తేదీల్లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. జిల్లా హాకీ అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి సదమస్తుల రమణ, కోశాధికారి సురేందర్‌, చిన్నయ్య, నాగేశ్‌, పీఈటీలు ఈట స్వామి, రాజేశ్‌, సురేశ్‌, రాజేశ్వర్‌, శ్రీకాంత్‌, కత్తి శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన వీఆర్‌ఏలు



మోర్తాడ్‌: రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేని శ్రీనివాస్‌రెడ్డిని ఆయన నివాసంలో మండల వీఆర్‌ఏలు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. గ్రామ రెవెన్యూ అసిస్టెంట్లుగా కొనసాగిన ఉద్యోగులను గత ప్రభుత్వం వివిధ శాఖలలో విలీనం చేసినా సరైన మార్గదర్శకాలను జారీ చేయకపోవడంతో వేతనాలను అందుకోలేదని వారు మంత్రికి విన్నవించారు. ప్రభుత్వంతో చర్చించి వీఆర్‌ఏలకు వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

చక్కెర ఫ్యాక్టరీని రైతులకు అప్పగించాలి



నిజామాబాద్‌ రూరల్‌: సారంగపూర్‌లో ఉన్న షుగర్‌ ఫ్యాక్టరీని రైతులకు, పాలకవర్గానికి అప్పగించాలని చక్కెర ఫ్యాక్టరీ పరిరక్షణ కమిటీ చైర్మన్‌ కొండెల సాయిరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు రూరల్‌ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, అర్బన్‌ ఎమ్మెల్యే ధన్‌పాల్‌ సూర్యనారాయణ గుప్తా, ఆర్మూర్‌ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డిని బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి సమస్యలను విన్నవించారు.

పట్టు పడితే పతకమే..



బంగారు పతకం అందుకుంటున్న ప్రసాద్‌, మహేశ్‌



చేయూతనందించరూ!

'సాక్షి'లో ప్రచురితమైన కథనం(ఫైల్‌)

- అంతర్జాతీయ రెజ్లింగ్‌ పోటీల్లో రాణిస్తున్న ఆర్మూర్‌ క్రీడాకారులు
- 75 కిలోల పోటీల్లో భాను ప్రసాద్‌, 65 కిలోల పోటీల్లో ఓర్సు మహేశ్‌ బంగారు పతకాలు
- నేపాల్‌లో నిర్వహించిన క్రీడల్లో ఘన విజయం

ఆర్మూర్‌: అంతర్జాతీయస్థాయి రెజ్లింగ్‌ పోటీల్లో ఆర్మూర్‌ క్రీడాకారులు రాణిస్తున్నారు. అంతర్జాతీయ క్రీడా వేదికపై జాతీయ జెండాను ఎగరవేయాలనే సంకల్పంతో ఆర్మూర్‌ పట్టణానికి చెందిన మిత్రులు డాకూరి భాను ప్రసాద్‌, ఓర్సు మహేశ్‌ ఆరేళ్లుగా పోటీ పడి తమ సంకల్పాన్ని సాకారం చేసుకున్నారు. నేపాల్‌లో నిర్వహించిన ఇండో నేపాల్‌ అంతర్జాతీయ రూరల్‌ గేమ్స్‌ చాంపియన్‌షిప్‌–2023 రెజ్లింగ్‌ పోటీల్లో నేపాల్‌ క్రీడాకారులపై విజయం సాధించి బంగారు పతకాన్ని బుధవారం కైవసం చేసుకున్నారు. వీరు అంతర్జాతీయ పోటీలకు హాజరు కావడానికి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవడంతో జూలైలో 'సాక్షి' దినపత్రికలో వీరిపై ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. దీంతో స్పందించిన ఆర్మూర్‌ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డితో పాటు సమాజ సేవకుడు పట్వార్‌ తులసి, పలువురు ఆర్థిక సహాయాన్ని అందించారు. దీంతో వారికి అంతర్జాతీయ వేదికపై తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశం దక్కింది. ఆర్మూర్‌ పట్టణానికి చెందిన భాను ప్రసాద్‌, ఓర్సు మహేశ్‌ ఆలూర్‌లోని మైనార్టీ గురుకుల పాఠశాలలో పీఈటీగా విధులు నిర్వహిస్తున్న జాతీయ స్థాయి రెజ్లింగ్‌ క్రీడాకారుడు భూపతిరాజ్‌తో శిక్షణ పొందారు. అక్టోబర్‌ 2019లో నిర్వహించిన తెలంగాణ స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌లో భానుప్రసాద్‌ ప్రతిభ కనబర్చి తన విజయ యాత్రను కొనసాగించాడు. తెలంగాణ అమెచ్యూర్‌ రెజ్లింగ్‌ అసోసియేషన్‌, రూరల్‌ గేమ్స్‌ ఆఫ్‌ స్టేట్‌ లెవల్‌ చాంపియన్‌ షిప్‌లో బంగారు పతకాలు కైవసం చేసుకున్నాడు. 2021 అక్టోబర్‌లో మహారాష్ట్రలోని పూణేలో నిర్వహించిన రూరల్‌ గేమ్స్‌ నేషనల్‌ చాంపియన్‌ షిప్‌లో జాతీయ స్థాయిలో 75 వెయిట్‌ క్యాటగిరీలో బంగారు పతకాన్ని కైవసం చేసుకొని అంతర్జాతీయ క్రీడలకు ఎంపికయ్యారు. కానీ పేదరికంతో అంతర్జాతీయ పోటీలకు హాజరు కాలేకపోయారు. అయినా ధైర్యాన్ని కోల్పోకుండా 2023లో మళ్లీ తమ ప్రయత్నాన్ని మొదలు పెట్టారు. రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీల నోటిఫికేషన్‌ రాగానే హైదరాబాద్‌లోని రెజ్లింగ్‌ అకాడమి కోచ్‌ నర్సింగ్‌ వద్దకు వెళ్లి ప్రత్యేక శిక్షణ పొంది క్రీడలో మెలకువలు నేర్చుకొన్నారు. జూలై 1న గోవాలో నిర్వహించిన రూరల్‌ గేమ్స్‌ నేషనల్‌ చాంపియన్‌ షిప్‌లో డాకూరి భాను ప్రసాద్‌, ఓర్సు మహేశ్‌ బంగారు పతకాలను కైవసం చేసుకొని అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. తాజాగా నేపాల్‌లో నిర్వహించిన అంతర్జాతీయ రెజ్లింగ్‌ పోటీల్లో 75 కిలోల వెయిట్‌ క్యాటగిరీలో భాను ప్రసాద్‌, 65 కిలోల విభాగంలో మహేశ్‌ ప్రతిభ కనబర్చి బంగారు పతకాలను కైవసం చేసుకున్నారు.

కుటుంబాల నేపథ్యం..

ఆర్మూర్‌ పట్టణంలోని సీఎస్‌ఐ చెవిటి, మూగ ఆశ్రమ పాఠశాలలో ఆయా, అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న రమణాబాయి, రమేశ్‌లకు ఇద్దరు కొడుకులు కాగా డాకూరి భాను ప్రసాద్‌ మొదటి వాడు. పదో తరగతి వరకు ఆర్మూర్‌ మండలం ఆలూర్‌లోని మైనార్టీ గురుకుల పాఠశాలలో చదివిన ఇతను ప్రస్తుతం జిల్లా కేంద్రంలోని సీఎస్‌ఐ జూనియర్‌ కళాశాలలో ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఆర్మూర్‌ పట్టణంలోని జిరాయత్‌నగర్‌ కాలనీలో కర్రీ పాయింట్‌ నిర్వహిస్తున్న సుజాత కుమారుడు మహేశ్‌ కాగా మరో కూతురు ఉంది. ఒంటరిగా కష్టపడుతూ పేదరికాన్ని పిల్లల దరికి చేరనివ్వకుండా తీర్చిదిద్దుతోంది. మహేశ్‌ కూడా ఆర్మూర్‌ మండలం ఆలూర్‌లోని మైనార్టీ గురుకుల పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసి ప్రస్తుతం పట్టణంలోని సాయి ఒకేషనల్‌ జూనియర్‌ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు.

రామాలయంలో ఘనంగా పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్‌: నగరంలోని సుభాష్‌నగర్‌ శ్రీరామాలయంలో బుధవారం ఉద్యాపన చెల్లింపు పూజా కార్యక్రమాలు భక్తిప్రపత్తులతో నిర్వహించారు. కార్తీక మాసం పురస్కరించుకుని నెలరోజుల పాటు ఆలయ ఆవరణలోని తులసివనంలో 108 తులసి మొక్కలకు బృందావన పూజ నిర్వహించారు. కార్తీక మాసం ముగిసిన మరుసటి రోజు ఆనవాయితీ ప్రకారం ఈ ఉద్యాపన చెల్లింపు పూజలు ఆలయ కమిటీ అధ్యక్షురాలు సరళ మహేందర్‌రెడ్డి, కార్యదర్శి శోభ నవీన్‌రెడ్డి, కోశాధికారి నల్ల శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. పెద్ద గుండం ఏర్పాటు చేసి భక్తులు దీపాలు వదిలారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షురాలు సరళ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ నెల 17 నుంచి జనవరి 14వ తేదీ వరకు ధనుర్మాస ఉత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 23న ముక్కోటి ఏకాదశి పురస్కరించుకుని ఉదయం 5:30 నుంచి వైకుంఠ ఉత్తర ద్వారదర్శనము ఉంటుందన్నారు. జనవరి 14న శ్రీ గోదారంగనాయక కల్యాణం నిర్వహిస్తామన్నారు. ఇందులో భాగంగా ప్రతిరోజూ సాయంత్రం 6:30 నుంచి 7:30 గంటల వరకు తిరుప్పావై కాలక్షేపము ఉంటుందన్నారు. ధనుర్మాస ఉత్సవ కమిటీ కన్వీనర్‌గా ఊర్మిళ పద్మనాభరెడ్డి, కోకన్వీనర్‌గా కట్ట రాధారాణి, ఈగ సబిత గంగారెడ్డి, సభ్యులుగా పద్మ నరేందర్‌రెడ్డి, లక్ష్మణరేఖ విఠల్‌రెడ్డి, విజయ శ్రీనివాసరెడ్డి, విజయ సదానంద్‌రెడ్డిలకు బాధ్యతలు అప్పజెప్పినట్లు పేర్కొన్నారు.

ఇప్పుడే ఏమైంది.. ముందుంది ముసళ్ల పండుగ

- బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ: ఎన్నికల్లో అధికారం చేపట్టిన కాంగ్రెస్‌ ప్రభుత్వం పలు పథకాలను అమలు చేయడంలో రైతులను మోసం చేస్తోందని, ఇప్పుడే ఏమైంది ముందుంది ముసళ్ల పండుగ అని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బాన్సువాడలోని ఎస్‌ఎంబీ ఫంక్షన్‌ హాల్‌లో బీఆర్‌ఎస్‌ పార్టీ కృతజ్ఞత సభ, కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనాన్ని బుధవారం నిర్వహించారు. అసెంబ్లీ స్పీకర్‌గా చేసిన ప్రతి ఒక్కరూ ఎన్నికల్లో ఓడిపోతే బాన్సువాడలో మాత్రం కార్యకర్తల కృషితో గెలిచి చరిత్ర సృష్టించినట్లు తెలిపారు. తన గెలుపునకు సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. రైతు బంధు నిధుల విడుదల, రైతుల రుణ మాఫీ విషయంలో కాంగ్రెస్‌ పార్టీ డొల్లతనం బయటపడిందని అన్నారు. ఎమ్మెల్యేగా నియోజకవర్గంలో ప్రజల మధ్యే ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. మంచి పని చేస్తే సమర్థిస్తాం.. ప్రజా వ్యతిరేకంగా పని చేస్తే నిలదీస్తామని అన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో నియోజకవర్గంలోని 124 జీపీ సర్పంచులు, 86 ఎంపీటీసీలను 9 మండలాలు, ఒక మున్సిపాలిటీని గెలిపించుకుని గులాబీ జెండా ఎగరవేయాలని సూచించారు. డబుల్‌ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణంలో దేశానికే బాన్సువాడ ఆదర్శంగా నిలిచిందని గుర్తు చేశారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కత్తెర గంగాధర్‌, నాయకులు అంజిరెడ్డి, ద్రోణవల్లి సతీశ్‌, బద్యనాయక్‌, మోహన్‌నాయక్‌, పాతబాలకృష్ణ, పద్మగోపాల్‌రెడ్డి, స్వరూప, అశోక్‌, ఎజాస్‌, గంగాధర్‌, కృష్ణరెడ్డి, శశికాంత్‌, రఘు, గడుమల లింగం, ఉప్పరి లింగం, బుల్లెట్‌రాజు, బాబా, సంగ్రాం నాయక్‌ తదితరులు ఉన్నారు.

వేల్పూర్‌లో ఇరువర్గాల మధ్య వివాదం



గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు

వేల్పూర్‌: మండల కేంద్రంలో ఇరువర్గాల మధ్య చాలా రోజుల నుంచి కొనసాగుతున్న స్థల వివాదం బుధవారం ఉద్రిక్తతకు దారితీసింది. దీంతో శాంతి భద్రతలు అదుపు తప్పకుండా పోలీసులు ముందు జాగ్రత్తగా 144 సెక్షన్‌ విధించారు. అదనపు బలగాలు మోహరించారు. అంబేడ్కర్‌ చౌరస్తా వెనుక భాగంలో ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి పక్కన ఉన్న స్థలంపై గ్రామంలో ఇరువర్గాల మధ్య చాలా రోజులుగా వివాదం నెలకొంది. అక్కడ రోడ్డు వెడల్పు జరిగినపుడు మట్టిని ఆ స్థలంలో వేశారు. ఆ మట్టితో అక్కడి స్థలం వికారంగా ఉందని, దానిని చదునుచేసి బాగుచేయాలని గ్రామస్తులు కోరుతూ వచ్చారు. తమ స్థలంపై వీడీసీ వారు ఒత్తిడి తెస్తున్నారని, మట్టిని తీయొద్దని ఒకవర్గం వారు సీపీ కల్మేశ్వర్‌ను కలిసి విన్నవించారు. దీంతో పోలీసులు ఇటీవల వేల్పూర్‌ వీడీసీకి నోటీసులు జారీ చేశారు. అంతేగాక వీడీసీ సభ్యులను మంగళవారం పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. తిరిగి గ్రామస్తులు పోలీసులకు నచ్చజెప్పి వీడీసీ సభ్యులను బయటకు తెచ్చారు. దీనిని సీరియస్‌గా పరిగణించిన వీడీసీ సభ్యులు గ్రామంలోని మిగతా వర్గాల వారందరితో సమావేశం నిర్వహించి రోడ్డు పక్కన ఉన్న మట్టికుప్పలను తీసేందుకు సమాయత్తం అయ్యారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు దారి తీయకుండా పోలీసులు ముందుగానే అదనపు బలగాలను రప్పించారు. డీసీపీ జయరాం ఆధ్వర్యంలో ఆర్మూర్‌ ఏసీపీ జగదీశ్‌చందర్‌, భీమ్‌గల్‌ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సైలు, పోలీసులు, రెవెన్యూ అధికారులు గ్రామస్తులతో మాట్లాడారు. ఇరువర్గాలను చర్చలకు ఒప్పించి, సయోధ్యకు ప్రయత్నించారు. చాలాసేపు చర్చించినా సయోధ్య కుదరలేదు. దీంతో ఒక వర్గం వారు వారం రోజుల తర్వాత తమ నిర్ణయం వెల్లడిస్తామని గడువు తీసుకున్నారు. దీంతో గొడవ సద్దుమణిగింది. మధ్యాహ్నం తర్వాత సాధారణ పరిస్థితులు నెలకొనడంతో పోలీసులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

సీఎం దృష్టికి 'ధరణి' సమస్యలు



సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సంఘం ప్రతినిధులు

సుభాష్‌నగర్‌: ధరణి పోర్టల్‌లో నెలకొన్న సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో రెవెన్యూ అసోసియేషన్‌ ప్రతినిధులు బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రతినిధులు వారికి పుష్పగుచ్ఛం అందజేశారు. ధరణి పోర్టల్‌లో ఉన్న సమస్యలు, రెవెన్యూ శాఖ బలోపేతం, తదితర అంశాలను సీఎం దృష్టికి తీసుకొచ్చారు. త్వరలోనే అన్ని సమస్యలను పరిష్కరిస్తామని సీఎం హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. రెవెన్యూ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి గౌతమ్‌కుమార్‌, జిల్లా అధ్యక్షుడు రమణ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

యువకుడి అదృశ్యం

ఖలీల్‌వాడి: నగరంలోని శివాజీనగర్‌కు చెందిన మున్సిపల్‌ కార్మికుడు సాయికుమార్‌ అదృశ్యమైనట్లు ఎస్సై అశోక్‌ బుధవారం తెలిపారు. అక్టోబర్‌ 21న ఇంటి నుంచి వెళ్లిన సాయికుమార్‌ తిరిగి రాలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. పలు చోట్ల వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఇరువురి మధ్య ఘర్షణ

ఖలీల్‌వాడి: నగరంలోని జిల్లా పరిషత్‌ దగ్గర ఉన్న ఓ కన్సల్టెన్సీ కార్యాలయంలో ఇరువురి మధ్య జరిగిన ఘర్షణలో గాయాలైనట్లు తెలిసింది. కన్సల్టెన్సీ కార్యాలయానికి పని నిమిత్తం వచ్చిన వ్యక్తితో ఆఫీస్‌ సిబ్బంది మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దారితీసింది. ఇరువురికి తీవ్రగాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు. ఈ విషయమై మూడో టౌన్‌ ఎస్సై ప్రవీణ్‌కుమార్‌ను వివరణ కోరగా ఇరువురు ఘర్షణ పడిన విషయం తెలిసిందని, ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

మద్నూర్‌లో పత్తి కొనుగోళ్లు ప్రారంభం



మద్నూర్‌(జుక్కల్‌): మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌ యార్డులో పత్తి బీట్లను ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు బుధవారం ప్రారంభించారు. పత్తి రైతులు మార్కెట్‌ కమిటీ యార్డులో పత్తిని విక్రయిస్తేనే మద్దతు ధర లభిస్తుందని అన్నారు. అనంతరం ఎమ్మెల్యేను అధికారులు, నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ సంగమేశ్వర్‌, కార్యదర్శి విఠల్‌, మేనూర్‌ సర్పంచ్‌ విఠల్‌గురుజీ, కాంగ్రెస్‌ నాయకులు హన్మాండ్లు, సాయిపటేల్‌, సాహెబ్‌రావు, భగవాన్‌, రాంపటేల్‌, వ్యాపారులు, రైతులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్‌

వాగులో మృతదేహం లభ్యం



రుద్రూర్‌: బొప్పాపూర్‌ శివారులోని గూండ్ల వాగులో అదే గ్రామానికి చెందిన బొజ్జి చిన్న పోశెట్టి (57) మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై నీరేశ్‌ బుధవారం తెలిపారు. వాగులో మృతదేహం ఉందన్న స్థానికుల సమాచారం ఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టినట్లు ఎస్సై పేర్కొన్నారు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి వాగులో పడి మృతి చెంది ఉంటాడని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కుటుంబ కలహాలతో ఒకరి ఆత్మహత్య



లింగంపేట: కుటుంబ కలహాలతో ఒకరు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని లింగంపల్లి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై ప్రభాకర్‌ తెలిపిన వివరాల ప్రకారం.. లింగంపల్లికి చెందిన సాయిలు 25 ఏళ్లుగా దుబాయిలో పని చేసి రెండేళ్ల క్రితం స్వగ్రామానికి వచ్చి మేస్త్రీ పని చేస్తూ జీవిస్తున్నాడు. కొన్ని రోజులుగా ఇంట్లో గొడవలు జరుగుతుండడంతో మనస్తాపానికి గురై ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రైలు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు



ఇందల్వాయి: రైలు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలైనట్లు 108 అంబులెన్స్‌ సిబ్బంది కిషన్‌ బుధవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గన్నారం రైల్వే అండర్‌ బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని రైలు నుంచి నాందేడ్‌కు చెందిన విశ్వనాథ్‌ జారి పడి తీవ్ర గాయాల పాలయ్యాడు. ట్రాక్‌మన్‌ ఐలయ్య బుధవారం ఉదయం అపస్మారక స్థితిలో ఉన్న విశ్వనాథ్‌ని చూసి ఇందల్వాయి స్టేషన్‌ మాస్టార్‌కు సమాచారం అందించాడు. మాస్టర్‌ అంబులెన్స్‌కు ఫోన్‌ చేయడంతో తాము బాధితుడికి ప్రథమ చికిత్స చేసి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, రైల్వే పోలీసులకి సమాచారం అందించినట్లు కిషన్‌ తెలిపారు.

గంజాయి పట్టివేత



ఆర్మూర్‌టౌన్‌: మండల కేంద్రంలోని దేగాం రోడ్డులో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్‌ సీఐ స్టీవెన్సన్‌ బుధవారం తెలిపారు. ఆలూర్‌లోని పల్లెప్రకృతి వనం సమీపంలో రాజేశ్‌ అనే వ్యక్తి గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి అతన్ని పట్టుకున్నట్లు పేర్కొన్నారు. రాజేశ్‌ నుంచి 220 గ్రాముల గంజాయిని పట్టుకుని సీజ్‌ చేసినట్లు తెలిపారు. కేసునమోదు చేసి రాజేశ్‌ను కోర్టులో హాజరు పర్చినట్లు చెప్పారు. తనిఖీలో సబ్‌ ఇన్‌స్పెక్టర్‌ గంగాధర్‌, ప్రమోద్‌ చైతన్య, హెడ్‌ కానిస్టేబుల్‌ గంగాధర్‌గౌడ్‌, కానిస్టేబుళ్లు దేవీదాస్‌, సాయిబాబా గౌడ్‌, గొల్ల శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

కంటెయినర్‌ను ఢీకొన్న బొలేరో వాహనం

- ఒకరు మృతి, మరొకరికి గాయాలు



వెంకటేశ్‌ (ఫైల్‌)



నుజ్జు నుజ్జు అయిన బొలేరో వాహనం

బాల్కొండ: కంటెయినర్‌ను బొలేరో వాహనం ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలైనట్లు ఎస్సై గోపీ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. భైంసాకు చెందిన వెంకటేశ్‌(27) నిర్మల్‌లోని ఓ డీజే షాప్‌లో పనిచేస్తున్నాడు. డీజే జనరేటర్‌ను మరమ్మతుల కోసం బొలేరో వాహనానికి కట్టుకొని నిజామాబాద్‌కు తీసుకెళ్తుండగా మండల శివారులోని జాతీయ రహదారిపై ముందున్న కంటెయినర్‌ సడన్‌ బ్రేక్‌వేయడంతో వెనుకనుంచి ఢీకొన్నది. ఈ ఘటనలో డ్రైవర్‌ సీటు పక్కన ఉన్న వెంకటేశ్‌ అక్కడికక్కడే మృతి చెందగా డ్రైవర్‌కు గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



ఎడపల్లి: జానకంపేటలో గుర్తు తెలియని వ్యక్తిమృతి చెందినట్లు ఎస్సై విక్రం బుధవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. జానకంపేటలో నిజామాబాద్‌ నుంచి బోధన్‌ వెళ్లే ప్రాంతంలోని పిల్ల కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉందన్న సమాచారం అందడంతో ఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టినట్లు పేర్కొన్నారు. మృతుడు కొంత కాలంగా భిక్షాటన చేస్తూ జీవించినట్లు చెప్పారు. మృతుడి వయస్సు 35 ఏళ్ల వరకు ఉంటుందని, బ్లూ కలర్‌ నైట్‌ ప్యాంట్‌, బూడిద కలర్‌ షర్ట్‌ ఉందన్నారు. కుడి చేతిపై తమిళంలో కుమార్‌ మంగవరం అని టాటూ ఉందన్నారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. ఎవరికైనా మృతుడి వివరాలు తెలిస్తే 8712659873 నంబర్‌కు సమాచారం అందించాలన్నారు.

చెట్టుని ఢీకొని ఒకరు..

బోధన్‌: రెంజల్‌ మండలంలోని దండిగుట్ట క్రాసింగ్‌ సమీపంలో చెట్టును ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందినట్లు స్థానికులు బుధవారం తెలిపారు. నవీపేట మండలానికి చెందిన మారయ్య (32) నవీపేట నుంచి సాటాపూర్‌ వైపు బైక్‌పై వస్తుండగా మార్గమధ్యలో దండిగుట్ట క్రాసింగ్‌ సమీపంలో చెట్టును ఢీకొన్నాడు. ఈ ఘటనలో మారయ్య అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు.

టేకు దుంగల తరలింపుపై విచారణ

బోధన్‌: సాలూర పీహెచ్‌సీలో ఇటీవల వీచిన ఈదురుగాలికి విరిగిపడిన టేకు చెట్ల దుంగల తరలింపుపై జీపీ వార్డు సభ్యులు వర్ని అటవీ శాఖ సెక్షన్‌ ఆఫీసర్‌ చంద్రప్రకాశ్‌కు ఫిర్యాదు చేశారు. అనుమతి లేకుండా సర్పంచ్‌ కుమారుడు టేకు దుంగలను తరలించారని పేర్కొన్నారు. ఈ మేరకు సదరు అధికారి పీహెచ్‌సీని బుధవారం సందర్శించి విచారించారు. ఈ విషయమై సెక్షన్‌ ఆఫీసర్‌ను 'సాక్షి' వివరణ కోరగా పీహెచ్‌సీ వైద్య సిబ్బంది తాము గ్రామ సర్పంచ్‌కు సమాచారం ఇచ్చి ఈదురుగాలికి విరిగిపడిన టేకు చెట్లు, విద్యుత్‌ స్తంభాలను తొలగించాలని కోరినట్లు చెప్పారని వివరించారు. ఈ క్రమంలో పంచాయతీ సిబ్బంది తొలగించినట్లు వెల్లడించారని పేర్కొన్నారు. ఇతర చోట ఉన్న మూడు టేకు దుంగలు భద్రంగానే ఉన్నాయని, వాటిని గురువారం తమ కార్యాలయానికి తరలిస్తామని తెలిపారు.

స్వగ్రామానికి చేరిన మృతదేహం



రోదిస్తున్న కుటుంబ సభ్యులు

మాచారెడ్డి: మండలంలోని రాజఖాన్‌పేటకు చెందిన సుంకోజు నరసింహ చారి(55) నవంబర్‌ 19న సౌదీ అరేబియాలో గుండె పోటుతో మృతి చెందగా ఆయన మృతదేహం బుధవారం స్వగ్రామానికి చేరింది. దీంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. గజ్యా నాయక్‌ తండా చౌరస్తాలో భార్యా, పిల్లలతో నివాసముంటున్న నరసింహచారి ఏడేళ్ల క్రితం బతుకుదెరువు కోసం సౌదీఅరేబియాకు వెళ్లాడు. అంత్యక్రియలకు జీడబ్ల్యూఏసీ ఎన్నారై పాలసీ కేంద్ర కమిటీ సభ్యుడు బిజిలి దేవయ్య హాజరయ్యారు. కాంగ్రెస్‌ పార్టీ అధికారంలోకి వస్తే గల్ఫ్‌ మృతులకు రూ. 5లక్షలు అందిస్తామని చెప్పిందని బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

సరంపల్లిలో గడ్డి దగ్ధం

కామారెడ్డి అర్బన్‌: పట్టణ పరిధిలోని సరంపల్లిలో బుధవారం సాయంత్రం కరెంట్‌ వైర్లు తగిలి ట్రాక్టర్‌పై ఉన్న గడ్డి దహనమైందని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. గ్రామానికి చెందిన తీగల సిద్ధిరాములు రూ. 20వేల విలువైన వరిగడ్డిని ట్రాక్టర్‌పై పశువుల మేతకు తీసుకెళ్తుండగా కరెంట్‌ వైర్లు తగిలి పూర్తిగా కాలిపోయిందన్నారు. అగ్నిమాపక శాఖకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన చేరుకుని ట్రాక్టర్‌, ఇతర ఆస్తులు కాలిపోకుండా కాపాడినట్లు సిబ్బంది పేర్కొన్నారు.

పలు చోట్ల చోరీ

సదాశివనగర్‌: మండలంలోని పద్మాజీవాడి చౌరస్తాలో ఉన్న వైన్స్‌లో మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డట్లు ఎస్సై రాజు బుధవారం తెలిపారు. రూ. 20వేల మద్యం, రూ.24,400 నగదును ఎత్తుకెళ్లినట్లు చెప్పారు. దుకాణ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కేబుల్‌ వైరు..

రుద్రూర్‌: మండలంలోని లక్ష్మీపూర్‌ క్యాంపు శివారులో బోర్‌ మోటారులకు చెందిన కేబుల్‌ వైరును మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు బాధిత రైతులు బుధవారం తెలిపారు. ఆరు నెలల క్రితం దుండగులు కేబుల్‌ వైర్లు ఎత్తుకెళ్లగా కొత్త వైరు బిగించగా మళ్లీ చోరీ జరిగిందని పేర్కొన్నారు. పోలీసులు, అధికారులు స్పందించి చోరీకి పాల్పడుతున్న వారిని పట్టుకొని శిక్షించాలని బాధిత రైతులు కోరుతున్నారు.

ట్రాక్టర్‌ బ్యాటరీ..

మోపాల్‌: మండలంలోని సిర్పూర్‌లో సింగిడి చిన్నారెడ్డికి చెందిన రూ.7500 విలువ చేసే ట్రాక్టర్‌ బ్యాటరీని మంగళవారం రాత్రి చోరీకి గురైంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం .. సిర్పూర్‌ నుంచి ముదక్‌పల్లి వెళ్లే రోడ్డులో మంగళవారం సాయంత్రం ట్రాక్టర్‌ కేజీవీల్స్‌ దుక్కి ఉందని అక్కడే ఉంచారు. బుధవారం ఉదయం వెళ్లి చూడగా బ్యాటరీ చోరీకి గురైంది.

గ్యాస్‌ కేవైసీకి వచ్చి మృతి

భిక్కనూరు: మండల కేంద్రంలోని హెచ్‌పీ గ్యాస్‌ ఏజెన్సీలో కేవైసీ చేయించేందుకు వచ్చిన ఒకరు మృతి చెందినట్లు ఎస్సై సాయికుమార్‌ బుధవారం తెలిపారు. రాజంపేటకు చెందిన జడగడుగుల స్వామి (43) మేస్త్రీ పనిచేస్తూ జీవిస్తున్నాడు. గ్యాస్‌ ఖాతాను కేవైసీ చేయించేందుకు భిక్కనూరుకు బైక్‌పై వచ్చాడు. గ్యాస్‌ ఏజెన్సీలో పని ముగించుకొని స్వగ్రామానికి వస్తుండగా కెనరా బ్యాంక్‌ ఎదుట బైక్‌పై నుంచి పడ్డాడు. గమనించిన స్థానికులు కామారెడ్డి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.